క్లుప్తంగా

'నేను బడికి పోతా'



ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

బూర్జ: నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా లక్కుపురం గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఎంపీపీ కర్నేన దీప గ్రామంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఏపీ సమగ్ర శిక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మన ఊరిబడి – మనపాలిట గుడి, పిల్లల భద్రత – బడిలోనే శిక్షణ ఉంది, బడిలోనే రక్షణ ఉంది– బడిలోనే మంచి భవిష్యత్తు ఉంది, ప్రభుత్వ బడులు – అందరికి అందుబాటులో ఉండే గుడులు అనే నినాదాలు చేశారు. హెచ్ఎం కె.రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సొంత నిధులతో మెట్లు నిర్మాణం



మెట్లును ప్రారంభిస్తున్న వెంకటరమణ

సారవకోట: మండలంలోని గుమ్మపాడు పంచాయతీ అక్కివలస గ్రామానికి సమీపంలో వంశధార కాలువ వద్ద ఆ గ్రామానికి చెందిన హనుమంతు రామారావు తన సొంత నిధులు రూ.1.20 లక్షలతో మెట్లు నిర్మించారు. మాజీ సర్పంచ్, టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ మెట్లును బుధవారం ప్రారంభించారు. గ్రామస్తులు స్నానం చేసేందుకు వీలుగా ఉండేలా మెట్లును నిర్మించినట్లు తెలిపారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి



విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. మండలంలోని తంప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను బుధవారం తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణకు సంబంధించిన రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థుల మానసిక సామర్థ్యాలను అంచనా వేస్తూ అధునాతన పద్ధతిలో పాఠ్యాంశాలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీఓ కామాక్షి

సారవకోట: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పక్కాగా నిర్వహించాలని సీడీపీఓ హెచ్.కె.కామాక్షి సూచించారు. మండల కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రీ స్కూల్ నిర్వాహణ పక్కాగా చేపట్టాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. చిన్నారుల బరువు, ఎత్తును యాప్‌లలో నమోదు చేయాలన్నారు. సూపర్‌వైజర్ సుజాత ఉన్నారు.

విదేశీ విద్యపై అవగాహన



మాట్లాడుతున్న డేవిడ్ ఫలోన్

నరసన్నపేట: విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించడం సులవేనని లియో గ్లోబల్ ఓవర్‌సీస్ డైరెక్టర్ డేవిడ్ ఫలోన్ అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో బుధవారం ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఔత్సాహిక విద్యార్థులకు తమ సంస్థ పూర్తి సహాయం అందిస్తుందన్నారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థుల్లో అనేక మంది విదేశాల్లో ఉన్నత చదువులు అభ్యసించేందుకు ఆసక్తి చూపుతున్నారని, సరైన అవగాహన లేక పోవడంతో ఆగిపోతున్నారన్నారు. పరీక్షలు, వీసా, భాష తదితర విషయాల్లో అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు ప్రధానంగా రెజ్యూమ్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, లెటర్ ఆఫ్ రికమెండేషన్‌పై దృష్టి సారించాలన్నారు. కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్, సైకాలజిస్టు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి రథయాత్ర

- సత్యవరం నుంచి పెద్దపేట రామాలయానికి ఊరేగింపు
- వివిధ అవతారాల్లో దర్శనం ఇవ్వనున్న స్వామివారు



సత్యవరంలో జగన్నాథస్వామి రథా యాత్రకు సిద్ధం చేస్తున్న రథం

నరసన్నపేట: మండలంలోని సత్యవరంలో కొలువు తీరిన జగన్నాథస్వామి రథోత్సవం ఈ నెల 7 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు, ఈఓ వసనాభి గాంధీ, రవి తెలిపారు. ఏటా రథోత్సవాలు పూరీ క్షేత్రంలో చేపట్టినట్లే నరసన్నపేటలో గల పెద్దపేట వీధిలోని జగన్నాథ స్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 7వ తేదీన స్వామివారు సత్యవరం నుంచి రథంపై పెద్దపేట ఆలయానికి ఊరేగింపుగా వెళ్తారు. 17వ తేదీ వరకు కొలువుదీరి ఉంటారు. 18న తిరిగి మారు రథా యాత్ర ద్వారా సత్యవరం గ్రామానికి చేరుకుంటారు. పెద్దపేట ఆలయంలో రోజుకో అవతారంలో జగన్నాథ స్వామి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ 9 రోజులూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

అవతారాలు ఇలా..

8న మత్స్యవతారం, 9న వరహావతారం, 10న నర్సింహాతారం, 11న వామనావతారం, 12న పరసురామావతారం, 13న రామావతారం, 14న కృష్ణావతారం, 16న వేంకటేశ్వర స్వామి అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. నరసన్నపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉన్న జగన్నాథ స్వామి ఆలయం వద్ద కూడా రథ యాత్ర సందర్భంగా ఈ పది రోజులు వివిధ అవతారాల్లో జగన్నాథ స్వామి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని ఆలయ అర్చకులు కృష్ణ మాచార్యులు తెలిపారు. మండలంలోని లకిమేరలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో కొలువుదీరిన జగన్నాథస్వామి అదే గ్రామంలో ప్రత్యేక మండంపై కొలువుదీరి భక్తులు దర్శనం ఇవ్వనున్నారని ఆలయ అర్చకులు తెలిపారు.



రథయాత్ర కోసం పెద్దపేటలోని ఆలయాన్ని ముస్తాబు చేస్తున్న దృశ్యం

పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మడపాంలో గ్రామస్థాయి సిబ్బందికి సూచనలిస్తున్న ప్రత్యేకాధికారి కవిత

నరసన్నపేట: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహణపై జిల్లా కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారని, పంచాయతీ కార్యదర్శులు అశ్రద్ధ వహిస్తే చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి, జిల్లా వికలాంగుల శాఖ ఏడీ కవిత అన్నారు. మండలంలోని మడపాం, మాకివలస గ్రామాల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను బుధవారం పరిశీలించారు. రెండు గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులకు వివిధ సూచనలు చేశారు. గ్రామాల్లో ఎక్కడా మురుగునీరు కనిపించకూడదని, ప్రధానంగా కుళాయిలు, నీళ్ల ట్యాంకులు, బోర్లు వద్ద మురుగునీరు ఉండకూడదన్నారు. గ్రామాల్లోని ప్రజలకు చైతన్యం కల్పించాలని కోరారు. గ్రామాల్లో జ్వరాలు, డయేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలితే వెంటనే స్పందించి వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకుని వాటి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నరసన్నపేట ఎంపీడీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆమదాలవలస: పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు ఈఈ సత్తారు బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు వరదావారి క్వార్టర్స్, బీఆర్ నగర్, గేట్ స్కూల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎస్ఐ నిహార్

ఎల్.ఎన్.పేట: నాటిన ప్రతి మొక్కనూ బతికించే బాధ్యత మనపైనే ఉందని సరుబుజ్జిలి ఎస్ఐ బి.నిహార్ అన్నారు. మండల కేంద్రంలో ఆలికాబ–బత్తిలి రోడ్డు డివైడర్ మధ్యలో స్థానిక బంగారు సంతోషి సంస్థల ప్రతినిధుల సహకారంతో బుధవారం మొక్కలను నాటారు. ప్రతి ఏడాది మొక్కలను నాటి వాటిని పెంచి పెద్దవి చేసే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. పలువురు మహిళలకు మామిడి, జామ, సపోట, కొబ్బరి వంటి పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. బంగారు సంతోషి ప్రతినిధులు వైశ్యరాజు చంద్రశేఖరరాజు (పొట్టిరాజు), పాండురంగనాథరాజు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న హరిప్రసన్న

పొందూరు: ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలుగజేస్తున్న జీఓ 117ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న కోరారు. మండలంలోని లైదాం పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. యాప్‌ల భారం తగ్గించి ఉపాధ్యాయులకు బోధన సమయం ఇవ్వాలని కోరారు. ఉద్యోగులకు మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. డీటీఎఫ్ పొందూరు శాఖ అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, సభ్యులు జి.గోపాలరావు, జి.రామారావు, సి.హెచ్.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే గోవిందరావుకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాతపట్నం:

అంగన్‌వాడీ వర్కర్స్‌కు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సభ్యులు బుధవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ తమ డిమాండ్ల పరిష్కారం కోసం గతంలో చేసిన దీక్షలకు గాను గత ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు న్యాయబద్ధంగా సమకూర్చాల్సిన హక్కులను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. తమ సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి అంగన్‌వాడీల సమ్మె ఒప్పందంలో అంగీకరించిన అంశాలను, మినిట్స్ కాపీల ఆధారంగా జీఓలను ఇవ్వాలని విన్నవించారు. యూనియన్ సభ్యులు మహాలక్ష్మి, రాణి, లీలా, సుజాత, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో లేకపోతే ఎలా?

పాతపట్నం: మండలంలోని బైదలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం తనిఖీ చేశారు. ఆ సమయంలో వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుబాటులో వైద్యులు లేకుంటే రోగులు ఎలా వస్తారన్నారు. ఓపీ, ఐపీ, మందులు రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రి నిర్వహణ సక్రమంగా లేదని అసహనం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఇంత నిర్లక్ష్యం పనికిరాదన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓతో ఫోన్‌లో మాట్లాడి నిర్లక్ష్యం వహించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

పూడికతీత పనులు పూర్తిచేయాలి

- డ్వామా పీడీ చిట్టిరాజు



మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

నరసన్నపేట: ఉపాధి పనులు బాధ్యతగా చేపట్టాలని, ఈ నెల 12వ తేదీ నాటికి సాగునీటి కాలువల్లో పూడికతీత పనులను పూర్తిచేయాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్ల కాలువలు, పెద్ద చానళ్లలో ఉపాధి పనులు చేపట్టాలని సూచించారు. పలు గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనుల్లో నాణ్యత కనిపించడం లేదని హెచ్చరించారు. సామాజిక తనిఖీల్లో ఏమాత్రం తేడాలు కనిపించినా చర్యలు తప్పవన్నారు. ఉపాధి వేతనదారులకు సరైన కొలతలు ఇవ్వాలన్నారు. మొక్కుబడిగా పనులు చేయిస్తే చర్యలు తప్పవన్నారు. ఎస్సీ, ఎస్టీ వేతనదారులకు పూర్తిస్థాయిలో ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. ఉద్యాన వన పంటలకు ఉపాధితో అనుసంధానం చేయడం జరిగిందన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించి ఉద్యాన వన పంటలు వేసేందుకు ప్రోత్సహించాలన్నారు. ప్రతీ ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్యం పెట్టుకోవాలన్నారు. అదనపు పీడీ మెండ జయరామ్, ఏపీడీ, నాలుగు మండలాల ఏపీఓలు పాల్గొన్నారు.

ఘనంగా మెకానిక్స్ డే



పాతపట్నం: కేక్ కట్ చేస్తున్న మెకానిక్‌లు



కొత్తూరు: కేక్ కట్ చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

పాతపట్నం:

స్థానిక శ్రీసాయిదుర్గా పెట్రోల్, డీజిల్ మెకానిక్, హెల్పర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మెకానిక్స్ డేను ఘనంగా నిర్వహించారు. మెకానిక్‌లందరూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. యూనియన్ అధ్యక్షుడు ఎం.వెంకటరమణ, సభ్యులు మోహన్, రామారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండల కేంద్రంలో విజయదుర్గా మెకానిక్ వెల్డర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మెకానిక్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పి.చంద్రరావు, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ కేక్ కట్ చేశారు. సభ్యులందరూ ఐక్యంగా ఉండాలని కోరారు. ఎవరికి ఎటువంటి కష్టం వచ్చినా ఆదుకోవాల్సిన బాధ్యత అందిరిపైనా ఉందన్నారు. అసోసియేషన్ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరుతూ సభ్యులు తీర్మానించారు. సంఘం ప్రతినిధులు వి.కామేష్, పి.లక్షణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్



పట్టుబడిన ఇసుక టిప్పర్

నరసన్నపేట: ఇసుకను అక్రమంగా విశాఖకు తరలిస్తున్న టిప్పర్‌ను నరసన్నపేట ఎస్ఈబీ ఎస్ఐ జానకీకావ్య పట్టుకుని సీజ్ చేశారు. జాతీయ రహదారిలోని సత్యవరం ఫ్లైఓవర్‌పై ఇసుకతో ఉన్న టిప్పర్‌ను బుధవారం ఉదయం పట్టుకున్నారు. 18 టన్నుల బరువు ఉందని ఎస్ఐ తెలిపారు. ఎటువంటి రసీదులు లేకపోవడంతో సీజ్ చేసి నరసన్నపేట పోలీసులకు అప్పగించామన్నారు. ఇసుక తవ్వకాలపై పూర్తి నిఘా పెట్టామన్నారు. కామేశ్వరిపేట, వెంకటాపురం, ముద్దాడపేటల్లో పర్యటించి సోదాలు చేశామన్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తే తెలియజేయాలని ఆయా గ్రామస్తులను కోరారు.

కౌలు గుర్తింపు కార్డులు పొందండి



నరసన్నపేట: మాట్లాడుతున్న ఏఓ సునీత



ఆమదాలవలస: భూసార పరీక్షల సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎఫ్‌టీసీ డీడీ త్రినాథస్వామి

నరసన్నపేట: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ కౌలు రైతుల కార్డులు పొందవచ్చని నరసన్నపేట వ్యవసాయాధికారి కె.సునీత అన్నారు. మండలంలోని చిక్కాలవలసలో బుధవారం కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. కౌలు రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. కౌలు రైతులకు కార్డులు ఇవ్వడం వల్ల భూ యజమానులకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. ఈ కార్డులు 11 నెలల వరకు వినియోగంలో ఉంటాయన్నారు. కౌలు రైతులు కార్డులు పొందేలా భూయజమానులు సహకరించాలన్నారు. వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: భూములు సాగు చేసే కౌలు రైతులు వారి వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏఓ పైడి లతశ్రీ అన్నారు. మండలంలోని తురకపేట రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. భూ యజమాని పట్టాదారు పాస్ పుస్తకం, 1బీ, ఆధార్ కార్డు జిరాక్స్‌లతోపాటు సాగు చేస్తున్న కౌలు రైతు ఆధార్ కార్డు, మూడు పాస్ ఫొటోలు తీసుకుని వీఆర్వో వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. సర్పంచ్ మొదలవలస యోగీశ్వరి, ఆర్ఐ గవరయ్య, వీఆర్వో జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: కౌలు రైతులు తప్పనిసరిగా పంట సాగు హక్కు గుర్తింపు కార్డులను పొందాలని ఎఫ్‌టీసీ డీడీ ఎ.త్రినాథస్వామి సూచించారు. మండలంలోని దూసి గ్రామంలో కౌలు రైతుల గుర్తింపు, నమోదు కోసం బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. కౌలు రైతులు తప్పనిసరిగా పంట సాగు హక్కు పత్రానికి దరఖాస్తు చేసుకుని గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. భూసార పరీక్షల గురించి వివరించారు. వ్యవసాయ శాఖ ఏడీ బగ్గు రజిని మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో వరి పంటలో చేపట్టవల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షల సర్టిఫికెట్లను అందజేశారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: దివ్యాంగుల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పెద్దపీట వేయడం జరిగిందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో దివ్యాంగులకు రూ.3,000 పింఛన్ ఉండేదని, దీనిని రూ.6,000 పెంచిన ఘనత టీడీపీదేనన్నారు. సంక్షేమ సంఘం ప్రతినిధులు ఊన్న సాయి, జి.రమణమూర్తి తదితరులు ప్రసంగించారు. అనంతరం పార్టీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న యూనియన్ బ్యాంక్ రీజనల్ డైరెక్టర్ సింధు

ఆమదాలవలస: సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ రీజనల్ డైరెక్టర్ సింధు సూచించారు. మండలంలో పొన్నంపేట గ్రామంలో సీఎఫ్ఎల్ కో ఆర్డినేటర్లు చిగురుపల్లి వెంకటేష్, రామారావు సమక్షంలో ఎస్ఎస్‌టీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని, ఎవరైనా ఫోన్ చేసి ఏటీఎం పిన్ కార్డు, బ్యాంకు అకౌంట్ వివరాలను అడిగితే వివరాలు చెప్పవద్దని సూచించారు. బ్యాంక్ అధికారులు ఎవరికీ ఫోన్లు చేసి వివరాలు అడగరని తెలిపారు. నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి.ఎం.జె.జె.వై, పి.ఎం.ఎస్.బి.వై బీమా పథకాల గురించి వివరించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ టోల్ ఫ్రీ నంబర్ 14448కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. సీసీ రామప్పడు, సీఎఫ్ గాయత్రి, గ్రామ పెద్దలు ఇప్పిలి సత్యం, ఇప్పిలి కోటేశ్వరరావు, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస: నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగునీరు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులతో బుధవారం ఆమదాలవలసలో సమీక్ష నిర్వహించారు. సాగునీటి కాలువలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ ఉన్నతాధికారులు, నాలుగు మండలాలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

70 యూనిట్ల రక్తం సేకరణ



రవికుమార్‌ను అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: అర్హులందరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ప్రముఖ వైద్యులు, శ్రీకాకుళం లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. నగరంలోని ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీలోని సత్యసాయి భజన మందిర ప్రాంగణంలో లయన్స్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ కొంతం సునీల్ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. 70 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు నిర్వహకులు తెలిపారు. సారవకోట సచివాలయ పరిధిలో వెటర్నరీ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రవికుమార్ సాహు కృషితో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. లయన్స్‌క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, పలు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు, లయన్స్ క్లబ్ సెంట్రల్ సభ్యులు పాల్గొన్నారు.